క్లుప్తంగా

దుర్గమ్మ దేవస్థానానికి పోటెత్తిన భక్తులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. ఇటీవల వివాహాలు చేసుకున్న నూతన వధూవరులతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు దారలప్పాడి లక్ష్మీప్రసాద శర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, అర్చనలు జరిగాయి. మొక్కులు చెల్లించే క్రమంలో నిర్వహించిన సంబరాలు, ఘటాలు, అమ్మవారి వేషధారణల నడుమ దేవస్థానం పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

రహదారిపై విరిగిపడిన భారీ వృక్షం



వృక్షాన్ని దగ్గరుండి తొలగిస్తున్న సీఐ మంగరాజు, ఎస్‌ఐ అనీష్

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ గ్రామం దగ్గర ఆదివారం సాయంత్రం వీచిన గాలులకు రహదారి మధ్యలో భారీ వృక్షం విరిగిపడింది. దీంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చినమేరంగి సీఐ మంగరాజు, ఎస్‌ఐ అనీష్ సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీతో పాటు స్థానికుల సాయంతో వృక్షాన్ని తొలగించారు. దీంతో రాకపోకలకు అంతరాయం తొలగింది.

నేడు నవగాంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం గ్రామంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తన ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించనున్నారు. ఈ మేరకు పార్టీ మండల కన్వీనర్ కణపాక సూర్యప్రకాశ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం నవగాం నుంచి అవలంగి, జి.వెంకటాపురం, మధ్యాహ్నం వంతవాడ, కొత్త వంతవాడ, కొత్త బర్న, డోలమడ, ఆర్‌బీఆర్.పేట గ్రామాల్లో ప్రచార కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. వైఎస్సార్‌సీపీ కుటుంబసభ్యులు, ప్రజా ప్రతినిధులు, పీఏసీఎస్, వివిధ కార్పొరేషన్ల అధ్యక్షులు, డైరెక్టర్లు, గృహసారథులు, బూత్ కన్వీనర్లతో పాటు కలిసివచ్చే ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బొమ్మికలో పంచాంగ శ్రవణం

భామిని: ఉగాది నుంచి ఆరంభమయ్యే నూతన క్రోధి నామ తెలుగు సంవత్సర పంచాంగ శ్రవణం ఆదివారం ఆరంభమైంది. భామిని మండలంలోని బొమ్మిక దొర తిరుపతి దొర ఇంటి సంప్రదాయంగా బత్తిలి పురోహితుడు రంపా లలిత ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నూతన పంచాంగం చదివి వినిపించారు. ఉగాదికి ముందస్తుగా దొరల ఇంటి దగ్గర పంచాంగ శ్రవణం ఆనవాయితీ. గిరిజన రైతులు బత్తాయిలు తెచ్చి పంచాంగ శ్రవణంలో పాల్గొని పంటలకు అనుకూలించే వర్షాలు. లాభాలు, సున్నాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

23 మంది వలంటీర్ల రాజీనామా

వీరఘట్టం: ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వలంటీర్లపై టీడీపీ కూటమి చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ వండవ సచివాలయం పరిధిలో ఉన్న 23 మంది వలంటీర్లు ఆదివారం సాయంత్రం రాజీనామా చేశారు. వండవ, అడారు, డెప్పివలస, పాపంపేట, శృంగరాయపురం గ్రామాలకు చెందిన వలంటీర్లు ఎమ్మెల్యే కళావతి సమక్షంలో రాజీనామా చేశారు. సోమవారం పంచాయతీ కార్యదర్శికి ఈ రాజీనామా పత్రాలను అందజేస్తామని వలంటీర్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమికి గుణపాఠం చెబుతామని వలంటీర్లు ఈ సందర్భంగా హెచ్చరించారు.

మరియమ్మా..ఆశీర్వదించమ్మా



మేరీమాతను ప్రార్థిస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: తల్లీ మరియమ్మా..నన్ను ఆశీర్వదించమ్మా అంటూ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మరియగిరి వద్దకు వెళ్లి మేరీమాతను ప్రార్థించారు. మండలంలోని యు.వెంకమ్మపేట వద్ద కొండపై వెలసిన మరియమ్మను ఆదివారం దర్శించుకుని ప్రార్థన చేశారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైఎస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం కార్యదర్శి నల్లబిల్లి సుహాసిని ఉన్నారు.

ప్రశాంతంగా గిరిజన గురుకుల ప్రవేశ పరీక్ష

సీతంపేట: గిరిజన సంక్షేమ ప్రతిభా పాఠశాల, కళాశాలల్లో (గిరిజన గురుకులం)లో 8 వతరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం స్థానిక ఏపీటీడబ్ల్యూజీఆర్ పాఠశాలలో నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు 302 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 214 మంది పరీక్షకు హాజరయ్యారు. అలాగే 8 వతరగతికి 101 మంది దరఖాస్తు చేసుకోగా 88 మంది హాజరయ్యారు. గిరిజన గురుకులం సొసైటీ జిల్లా అధికారిణి సుహాసిని ప్రవేశపరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ప్రిన్సిపాల్స్ పి.సూర్యకుమారి, ఆరుణ్‌జ్యోతి పర్యవేక్షించారు.

క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్యం

- రూ.49కోట్ల వ్యయంతో ఏజెన్సీలో సూపర్‌స్పెషాల్టీ ఆస్పత్రి
- రూ.3కోట్ల వ్యయంతో పాలకొండ ఏరియా ఆస్పత్రిలో వసతులు
- నియోజకవర్గ వ్యాప్తంగా వైద్యరంగానికి పెద్దపీట



పూర్తిస్థాయి వసతులతో సేవలందిస్తున్న పాలకొండ ఏరియా ఆస్పత్రి



రూ.20 కోట్లతో వంద పడకల ఆస్పత్రిగా రూపుదిద్దుకుంటున్న సీతంపేట పీహెచ్‌సీ



నాడు-నేడులో భాగంగా పూర్తిస్థాయి వసతులు, సౌకర్యాలతో సిద్ధమైన భామిని పీహెచ్‌సీ

పాలకొండ రూరల్: ఏజెన్సీ కలబోసి ఉన్న పాలకొండ నియోజకవర్గంలో వైద్యం ఓ ప్రహసనంగా ఉండేది. గతపాలకులు వైద్యరంగంపట్ల కినుకు వహించడంతో చిన్నపాటి ఆరోగ్య సమస్య తలెత్తినా ప్రజలు మెరుగైన వైద్య సేవలు పొందేందుకు ఇతర ప్రాంతాలకు పరుగులు తీసేవారు. నియోజకవర్గ కేంద్రం పాలకొండలో వందపడకల ఏరియా ఆస్పత్రి సమీప 14 మండలాలకు పెద్దదిక్కుగా నిలిచేది. నిత్యం వందల సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వచ్చి వారి ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకునేవారు. అయితే గతంలో ఇక్కడి చాలీచాలని వసతులు, వైద్యుల కొరత, భవనాల లేమి రోగులను వెక్కిరించేవి. ప్రజల ఒత్తిడి తట్టుకోలేక వైద్యులు రోగులను శ్రీకాకుళం, విశాఖపట్నం రిఫర్ చేసేవారు. 1994లో నిర్మించిన ఆస్పత్రి అభివృద్ధికి 2015లో నూతన భవనాల నిర్మాణం, అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఆదే ఏడాది ఈ పనులకు సంబంధించి రూ.7.56కోట్లు కేటాయించారు. 2017- 2018లో దశలవారీగా పనులు చేపట్టారు. నిధులు పూర్తిస్థాయిలో అందలేదని, చేతికందిన సొమ్ముతో ఇంతవరకే పనులు జరిగాయన్న చెప్పి అసంపూర్తిగా పనులు వదిలేసి కాంట్రాక్టర్ తప్పుకున్నాడు. దీంతో పాత భవనాలు రూపుకోల్పోయి, నూతన భవనాలు పూర్తికాక అటు రోగులు ఇటు వైద్యులు అవస్థలు పడ్డారు. టీడీపీ హయాంలో స్థానిక ఏరియా ఆస్పత్రితో పాటు నియోజకవర్గంలో మిగిలిన ఆస్పత్రులు, పీహెచ్‌సీలు సమస్యల వలయంలో కునారిల్లాయి. ఇదంతా గతం.

ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ హయాంలో పాలకొండ ఏరియా ఆస్పత్రిలో సేవలు విస్తృతం చేశారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఇక్కడ అందించిన సేవలను ప్రజలు మెచ్చుకునేలా నిలిచాయి. అప్పట్లో ప్రత్యేక ఆక్సిజన్ యూనిట్‌తోపాటు వార్డులను ఆధునికీకరించారు. గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఆస్పత్రి సరికొత్త రూపం సంతరించుకుంది. తాజాగా రూ.3కోట్లతో అధునాతన వైద్య పరికరాలతో పాటు సెంట్రల్ ఆక్సిజన్ ప్లాంట్, పది పడకల ఐసీయూ, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆస్పత్రి డిజిటైలేజేషన్‌కు 20 కంప్యూటర్లతో పర్యవేక్షణ, 300 ఎంఏ ఎక్స్‌రే మెషీన్, బ్లడ్ బ్యాంక్, పూర్తిస్థాయి వైద్య సిబ్బంది అందుబాటులోకి వచ్చింది. నగర పంచాయతీ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు రూ.38 లక్షలతో తలపెట్టిన అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తికావచ్చింది.

ఏజెన్సీకే మణిహారంలా..

నియోజకవర్గంలో కీలకమైన సీతంపేటలో 99 శాతం గిరిజనులే. వారికి వైద్యసేవలు అందించేందుకు మండల కేంద్రంలో పీహెచ్‌సీ ఉండేది. దీనిని తాజాగా ప్రభుత్వం రూ.20కోట్ల వ్యయంతో వంద పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దింది. గిరిజనులతోపాటు చుట్టుపక్కల మండలాలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా రూ.49 కోట్లతో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిని యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తోంది. ఈ ఆస్పత్రి నిర్మాణం ఏజెన్సీకే మణిహారంగా మారనుంది. అలాగే మండలంలోని కుసిమి, మర్రిపాడు, దోనుబాయి పీహెచ్‌సీలను నాడు-నేడు పేరిట అభివృద్ధి చేశారు.

గిరిజనగూడల్లో..

ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఎత్తైన ఏజెన్సీ దాదాపు 490 గిరిజనగూడల్లో సైతం వైద్యసేవలు విస్తృతం చేశారు. గిరిజనుల గడప వద్దకే సర్కారు వైద్యాన్ని తీసుకువెళ్లిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కింది. మాతా, శిశు సంరక్షణ (ఎంసీహెచ్), శిశు మరణాల నివారణ (ఐఎంఆర్), గర్భిణుల సంరక్షణ (ఎంఎంఆర్) వంటి కార్యక్రమాలతో ఆరోగ్య రక్షణ కల్పిస్తున్నారు. సికిల్‌సెల్, ఎనీమీయా వంటి ప్రాణాంత వ్యాధులను ముందుగా గుర్తించి, నిర్ధారించే స్క్రీనింగ్ కార్యక్రమాలను ఏజెన్సీలో విస్తృతం చేశారు. పీహెచ్‌సీలకు అనుసంధానంగా సచివాలయ ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, విలేజ్ క్లినిక్‌ల ద్వారా 28 యాప్‌లను ఏర్పాటు చేశారు. ప్రజల వ్యక్తిగత ఆరోగ్య భద్రతపై రోజువారీ నివేదికలను ప్రభుత్వం సేకరిస్తోంది.

నాడు-నేడు పేరిట మండలాల్లో ..

ఈ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పేరిట గ్రామాల్లోని పీహెచ్‌సీల్లో పూర్తి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి పాలకొండ మండలంలో అన్నవరం, ఎం.సింగుపురం, భామిని మండలంలో బత్తిలి, బాలేరు పీహెచ్‌సీలు, వీరఘట్టం, బిటివాడ పీహెచ్‌సీల్లో వసతులు, వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, శతశాతం సిబ్బంది అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ ప్రభుత్వం వైద్య సేవలను గాడిలో పెట్టింది. ఇదిలా ఉండగా సచివాలయాలకు అనుసంధానంగా ప్రాథమిక వైద్య కేంద్రాలు ఉన్న చోట కాకుండా మిగిలిన గ్రామాలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేలా వెల్‌నెస్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.17లక్షల చిలుకు వ్యయం ఖర్చుచేస్తుంది . క్షేత్ర స్థాయిలో ఈ కేంద్రాల ద్వారా ఉచిత వైద్య సేవలు, మందులు అందిస్తున్నారు.

అందుబాటులోకి వైద్యసేవలు



ఈ ప్రభుత్వం హయాంలో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుతో వైద్యం స్థానికంగా లభిస్తోంది. మందులు అందిస్తున్నారు. గతంలో ఏ చిన్న సమస్య వచ్చినా మండల కేంద్రాలకు పరుగులు తీసేవారం. ఇప్పుడు నేరుగా నిపుణులైన వైద్యులు పల్లెల్లో దర్శమిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంపట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం హర్షణీయం.

కరణం విశాలాక్షి, గొట్ట మంగళాపురం, పాలకొండ మండలం..

అందుబాటులోకి ఆధునిక సౌకర్యాలు



గతంతో పోల్చుకుంటే ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, వసతులు అందుబాటులోకి వచ్చాయి. రూ.3కోట్ల ఖర్చుతో సెంట్రల్ ఆక్సిజన్ యూనిట్, నూతన ఎక్స్‌రే విభాగం, పూర్తి సౌకర్యాలతో, సాంకేతిక విలువలు గల ఐసీయూ, బ్లడ్ బ్యాంక్ వంటివి కొలువుదీరాయి. వైద్య పరికరాలు, మందులు అవసరం మేర అందుబాటులో ఉన్నాయి. ఓపీ పెరిగింది. అందుకు తగ్గట్లు వైద్య పరమైన ఏర్పాట్లు చేపడుతున్నాం. ప్రత్యేకంగా 20 మానిటర్లతో డిజిటిలైజేషన్ చేయిస్తున్నాం. ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోంది.

జి.నాగభూషణరావు, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, పాలకొండ

టీడీపీ కూటమిని తరిమికొడదాం

- పాలకొండ ఎమ్మెల్యే కళావతి
- పెత్తందార్లు..పేదల మధ్య యుద్ధం
- పేదలపక్షాన జగనన్నకు తోడుగా ఉందాం



చిదిమిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి



పీవీఆర్ పురంలో ప్రచారరథంపై నుంచి ప్రజలను పలకరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, పక్కనే అరకు ఎమ్మెల్యే ఫల్గుణరావు

వీరఘట్టం: ఈసారి జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు పెత్తందార్లు..పేదల మధ్య జరుగుతున్న యుద్ధమని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. పేదల పక్షాన పోరాడుతున్న జగనన్నకు మనమందరం తోడుగా ఉందామని ఎమ్మెల్యే కళావతి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆమె వీరఘట్టం మండలంలోని యు.వెంకమ్మపేట, చిదిమి, పీవీఆర్ పురం,తూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌ను చాలా మంది ముఖ్యమంత్రులు పరిపాలించారని, ప్రతిపక్షాలు ఎంతో హుందాగా ఉండేవని ఎమ్మెల్యే కళావతి అన్నారు. ప్రతిపక్షాలు ఎప్పుడూ ప్రజల పక్షాన పోరాడుతుంటాయని, అయితే నేడు మన రాష్ట్రంలో మాత్రం టీడీపీ కూటమి పక్షాలు ప్రజలను పీడిస్తున్నాయన్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందనీయకుండా అడుగడుగునా అడ్డుపడుతున్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో వలంటీరు వ్యవస్థ ద్వారా నూతన శకానికి శ్రీకారం చుట్టిందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను దళారుల ప్రమేయం లేకుండా వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. ఈ వలంటీర్ల ద్వారా ప్రభుత్వానికి ప్రజల్లో మంచి గుర్తింపు రావడంతో ఓర్వలేని టీడీపీ కూటమి ప్రజలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండడం సిగ్గుచేటన్నారు. వృద్ధులు,

మేలుచేసే నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి

గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేశారని ఎమ్మెల్యే కళావతి అన్నారు. విద్య, వ్యవసాయం, వైద్య రంగాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసి లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు.

హ్యాట్రిక్ విజయం అందిస్తాం

ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యే కళావతికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే కళావతికి హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తామని ప్రజలంతా ముక్తకంఠంతో నినాదాలు చేశారు. ప్రజల పక్షాన ఎప్పుడూ ప్రజల్లోనే ఉంటూ ఓ సాధారణ మహిళగా మాకు సేవలందిస్తున్న నిస్వార్థ నాయకురాలు మన ఎమ్మెల్యే కళావతి అంటూ ప్రజలు ప్రశంసించారు. ఈ ఎన్నికల ప్రచారంలో అరుకు ఎమ్మెల్యే చెట్టి ఫల్గుణరావు, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, మహిళా విభాగం కార్యదర్శి నల్లబిల్లి సుహాసిని, వైఎస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, పాలకొండ ఏఎంసీ వైస్‌చైర్మన్ పాట్నూరు లక్ష్మణరావు, సర్పంచ్‌లు శొంట్యాన లక్ష్మి, దమలపాటి ఉమామహేశ్వరరావు, ఉదయాన జగన్‌మోహన్‌రావు, కుద్దిగాన వెంకటరమణమూర్తి, నీలంసత్యంనాయుడు, శంభాన శ్రీను, వారాడ శ్రీరాములు నాయుడు, చందక వెంకటరమణ పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ



ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎస్ సొసైటీ కార్యదర్శి గౌస్

కురుపాం: మండల కేంద్రంలోని ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం 15 నిరుపేద ముస్లిం కుటుంబాలకు పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా సొసైటీ కార్యదర్శి షేక్ గౌష్ చేతుల మీదుగా నిత్యావసర సరుకులైన బియ్యం, పంచదార, గోధుమ పిండి, సేమియా, వంట నూనెతో పాటు దుస్తులను అందజేశారు. రంజాన్ మాసంను భక్తి శ్రద్ధలతో ఎటువంటి తారతమ్యం లేకుండా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిరుపేద ముస్లిం కుటుంబాలు పాల్గొన్నాయి.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా



పోలీస్ చెక్‌పోస్టు వద్ద వివరాలు సేకరిస్తున్న సీఐ చంద్రమౌళి

పాలకొండ రూరల్: ఎన్నికల నేపథ్యంలోనే కాకుండా సాధారణ సమయాల్లో కూడా పోలీస్ చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా కొనసాగుతుందని పాలకొండ సీఐ మీసాల చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు ఆదివారం పోలీస్ సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న చెక్‌పోస్టుల పనితీరుపై ఆయన ప్రత్యేక సందర్శన చేపట్టారు. పోలీస్ సబ్‌డివిజన్ అధికారి జీవీ.కృష్ణారావు సూచనలతో అంతరజిల్లాలు, రాష్ట్రాలకు సంబంధించిన చెక్‌పోస్టుల మీదుగా కొనసాగుతున్న వాహనాలు, అనుమానితులను క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు. ఈ క్రమంలో కేవలం నగదు తరలింపులపై మాత్రమే కాకుండా నిషేధిత వస్తువులు, మద్యం, కలప, అక్రమ బియ్యం తరలిపోకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గానికి ఇరువైపులా ఒడిశా నుంచి ఈ ప్రాంతాల్లోకి వచ్చే మార్గాలపై గట్టి భద్రత కొనసాగుతుందని స్పష్టం చేశారు. బత్తిలి వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులో ఇటీవల కాలంలో 14 కేసులు నమోదు చేశామని, 220 లీటర్ల సారా, మద్యం 30 లీటర్లు, రెండు ద్విచక్రవాహనాలు సీజ్ చేశామని వివరించారు. గంజాయి తరలింపుపై ఉక్కుపాదం మోపామని తెలియజేశారు. దీంతోపాటు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం ద్వారా స్పష్టమైన హెచ్చరికలు చేస్తున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం కావాలి



లఖనాపురంలో జరిగిన ఎన్నికల సమావేశంలో మాట్లాడుతున్న మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు చిత్రంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం కావాలని కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని లఖనాపురం, నాగూరు, చిలకాం, కారివలస, దత్తివలస, రావివలస గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి జరగాలంటే రానున్న ఎన్నికల్లో మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్నను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, అరకు ఎంపీగా తనూజారాణిని గెలిపించాలని కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో సీఎం జగన్ సంక్షేమం అన్ని వర్గాలకు అందజేశారన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం, అంబేడ్కర్ ఆశించిన సమసమాజ స్థాపన మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రచారంలో ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, బీసీ కార్పొరేషన్ చైర్మన్ రంగుముద్రి రమాదేవి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు దూసి చిట్టెమ్మ, ద్వారపురెడ్డి గంగమ్మ, బొత్స అప్పడు, నాయకులు ద్వారపురెడ్డి ధనుంజయరావు, ముదిలి గౌరునాయుడు, కేతిరెడ్డి అచ్యుతరావు, కేతిరెడ్డి కూర్మినాయుడు, అక్కేన వెంకటనాయుడు, బొత్స అప్పలనాయుడుతోపాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యమే ప్రధానం

పాలకొండ: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యమే ప్రధానమని, అందుకోసం జాగ్రత్తలు తీసుకోవాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం కోసం తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. గాయత్రి నర్సింగ్ కళాశాల విద్యార్థులు, వైద్యుడు చిరంజీవి, స్టాఫ్‌నర్స్ సోఫియాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ అనంతరం మానవహారం రూపొందించి నినాదాలు చేశారు.

గోవిందమ్మ పేరంటాలు జాతర రేపు

వీరఘట్టం: మండలంలోని అచ్చెపువలస గ్రామ సమీపంలో వెలసిన గోవిందమ్మ పేరంటాలు జాతర మంగళవారం నిర్వహించనున్నట్లు యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా ఉగాది పర్వదినాన ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఉగాది పండగ రోజు జాతర జరుగుతుందని, జాతర సందర్భంగా రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవిందమ్మ తల్లిని దర్శించుకోవాలని శర్మయాజీ కోరారు.

ఊరించిన వర్షం

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీలో ఆదివారం సాయంత్రం భారీ వర్షమే కురుస్తుందని అంతా ఆశించారు. కానీ చిరుజల్లులే కురిసాయి. పగటిపూట 42 డిగ్రీల వరకు ఎండ కాయడంతో పాటు వడగాల్పులు వీయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సాయంత్రానికి ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడంతో భారీ వర్షమే కురుస్తుందని అంతా భావించారు. అయినా ఏ మాత్రం వర్షం కురవకపోవడంతో ఉసూరుమన్నారు.

రైతులకు సాంకేతిక సేవలు

పాలకొండ: రైతులకు భూ సార పరీక్షల ద్వారా భూ స్వభావం తెలుసుకుని అందుకు అనువైన పంటలు వేసేందుకు అవసరమైన చర్యలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. దీంతో పాటు పాడి రైతులకు అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు భూ సార పరీక్షా కేంద్రాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహరెడ్డి రైతులను ఆదుకునేందుకు రూ.కోటితో సాంకేతికత అందించే పరిశోధన కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. నియోజకవర్గ కేంద్రంలో ఈ పరిశోధన కేంద్రం ద్వారా రైతులకు అన్ని విధాలుగా సాంకేతిక సహాయం అందిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా మట్టిని సేకరించిన భూమి స్వభావం గుర్తించే పరీక్షలు పూర్తి చేశారు. ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని ప్రభుత్వం నియమించింది.

వేసవితాపానికి ఉపశమనం



కోనేరులో సేదదీరుతున్న పశువులు

పాలకొండ రూరల్: మూడు రోజులుగా మండలంలో ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పాటు వేడి గాలులు వీస్తుండడంతో ఉదయం 10 గంటల నుంచి ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. మధ్యాహ్నం సమయంలో జనసంచారం లేక ప్రధాన రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఆదివారం ఎండతీవ్రత మరింత పెరగడంతో అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడ్డారు. మనుషులతోపాటు పశుపక్ష్యాదులు ఎండ తీవ్రతకు అల్లాడుతున్నాయి. కనిపిస్తున్న చెట్ల నీడలో, నీటి వనరుల్లో సేదతీరుతున్నాయి. స్థానిక వెంకటరాయుని కోనేరులో పెద్దెత్తున పశువులు ఉపశమనం పొందాయి. ఈ ఎండల కారణంగా వడదెబ్బకు గురయ్యే ఆస్కారం ఉన్నందున తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఉత్సాహంగా జాతర



గుమ్మలక్ష్మీపురంలో నిర్వహిస్తున్న జాతరకు హాజరైన ప్రజలు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఉమాసహిత కైలాసనాథ స్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవ వేడుకలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవంలో భాగంగా గత నాలుగు రోజులుగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వినోదాల కోసం జాయింట్ వీల్, బ్రేక్‌డ్యాన్స్ చైర్, డ్రాగన్ ట్రైన్ , చైనాబజార్లు తదితరవి ఏర్పాటు చేయడంతో పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చి తిలకిస్తున్నారు. ఆదివారం జాతరకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాట్లు

పాలకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు తహసీల్దార్ వరహాలు ఈ పనులను ఆదివారం పర్యవేక్షించారు. ఇటీవల ఎన్నికల ఆర్‌ఓ కల్పనాకుమారి సూచనల మేరకు ఈవీఎంలను భద్రపరిచేందుకు అనుకూలంగా కళాశాల గదులను సిద్ధం చేశారు.